


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

96

(17 ' నవంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఎక్కువ తక్కువ** అనేవి చాలా విషయాలలో వాడబడుతూ ఉంటాయి. సృష్టిలో అనేక సంపదలుంటాయి. మానవులలో అనేక గుణాలుంటాయి. ఆచారాలలో అనేక వివరాలుంటాయి.

ఈ అన్నింటిలో ఎక్కువ తక్కువల ప్రసక్తి వస్తూనే ఉంటుంది. ఇదివరలో కులాలలో ఎక్కువ తక్కువలని చెప్పుకునేవారు. అవన్నీ క్రమంగా సమసిపోతున్నవి. "భగవంతుని సంతానమంతా ఒక్కటే" అనే సత్యాన్ని గ్రహించడం జరుగుతోంది.

మానవులలో ఎక్కువ తక్కువలని చెప్పుకునేవారిదివరలో. ధనం ఉన్నవారు ఎక్కువనీ, పదవులలో ఉన్నవారు ఎక్కువనీ, చదువుకున్నవారు ఎక్కువనీ, వయస్సులో ఉన్నవారు ఎక్కువనీ, ఇలా ఎన్నెన్నో విధాలుగా ఎక్కువ తక్కువలు నిర్ణయించినదే

ఇప్పుడా పరిగణనే ఉండటంలేదు. సొమ్మున్నవాళ్ళను చూచి ఎవరూ "ఎక్కువ వాడు" అనుకోవడంలేదు. ఎవరి ఎక్కువ వారిదే పొమ్మంటున్నారు. పదవుల్లో వున్న వారిని చూచి ఎవరూ భయపడటం లేదు. "ఆ ఎక్కువ నీదికాదు నీ పదవిది" అంటున్నారు.

చదువుకున్నాడు, మహా పండితుడు, శాస్త్ర సారమంతా వడబోశాడు. సరస్వతీ స్వరూపుడు అని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. "ఆయన చదువువల్ల మా కొచ్చేదేమిటి? అవకాశం ఉంది కాబట్టి చదివాడు. అయినా ఈ కాలంలో అంత చదువు అనవసరం. గ్రంథాల పురుగు అయిపోతాడు కానీ లోకజ్ఞానమనే గ్రంథం ఎంతమాత్రం అంటదు" అంటూ విమర్శిస్తున్నారు.

పోనీ ఆధునిక విద్యల్లో పెద్ద పెద్ద పరిశోధనలు వగైరాలు చేసి డాక్టరేటులు పొందిన వారిని చూచినా 'ఎక్కువవారు' అనడానికి చాలామందికి మనస్సొగడం లేదు. నా విద్యల్లో నేనే గొప్పవాణ్ణి. నా విద్య ఆయనకు రమ్మంటే వస్తుందా అని సగర్వంగా చెపుతారు.

"కాదయ్యా అలాంటివారు దేశానికి ఎంతో ఉపయోగపడతారు" అని సంజాయిషీ చెప్పబోతే వారు తమ వ్యాఖ్యానాన్ని సాగదీస్తున్నారు. దేశానికి ఎవరు ఉపయోగం లేదో చెప్పండి. గొడ్లను కాసే కుర్రవాడు దగ్గర నుంచి రోడ్లు వేసే కూలీదాకా అంతా అవసరమే. ఎవరి ప్రత్యేకత వారికుంది" అని చెపుతున్నారు. కాదనడం ఎలా?

కవులు గొప్పవారయ్యా అంటే 'కావచ్చు కానీ, కంచంలో కూడుకోసం మూడుపూటలా వెతుక్కునే కాలంలో కవిత్వాలు వినే వోపికా, సోకు ఎక్కడుంది. ఎవరో కడుపు నిండిన కొద్దిమందికి గొప్పతనం కావాలి' - అంటున్నారు.

నిజానికి యీ రోజుల్లో అందరికంటే రైతే గొప్ప అనే సత్యం అందరూ అంగీకరిస్తున్నారు. "నువ్వు పొలాలు పండించాలి. మా కడుపులు పండించాలి" అని మూగగా వారు రాగాలాపన చేస్తున్నారు. రకరకాలుగా వినిపిస్తున్నారు. 'రైతే రాజు' అనే కితాబు కూడా అందిస్తున్నారు.

పంట ఎక్కువగా పండించిన రైతు మహాశయుణ్ణి పూర్వకాలంలో క్రతువు లెక్కువ చేసిన రాజులతో పోలుస్తున్నారు.

రైతే రాజైతే ధాత్రి స్వర్గము కాదా! అని చెప్పుకుని గర్విస్తున్నారు. రైతు అందరికన్నా ఎక్కువ అంటే ఈ రోజుల్లో కాదనేవారు ఎవరూ లేరు. అసలలా అనడానికి అవకాశం కూడా లేదు.

పూర్వం ప్రభువులనీ, ప్రజలనీ, రెండు తెగలుండేవి. పాలకు లెక్కువ అనీ, పాలితులు తక్కువ అనీ, భావించేవారు. భావించడమేమిటి పాలితులకు భగవంతునికంటే ఎక్కువగా మ్రొక్కడం అలవాటైపోయింది ప్రజలకు.

ఇప్పుడు వ్యత్యాసాలు అంతరించినాయి. జీవిత సత్యాలు బయటపడ్డాయి. ఎవరికి వారే ఎక్కువ అని అంగీకరుస్తున్నారు. ఇంకా చెప్పాలంటే ప్రజలే ఎక్కువ అనే నిర్ణయం కూడా జరిగింది.

ఒకవేళ అలాంటి వ్యత్యాసాలు ఏర్పడతాయనే భయాన్ని పోగొట్టుకోవడానికి ప్రతి సంస్థలో యూనియన్లు ఏర్పడ్డాయి. వాటిద్వారా తమ ప్రత్యేకతను నిలబెట్టుకోవడానికి సభ్యులు ప్రయత్నించగలరు. పూర్వకాలం వారు -

"తక్కువేమి మనకూ
రాముండొక్కడుండు వరకూ"

అని ఎంతో ధీమాగా పాడుకుంటూ వుండేవారు. కొందరిప్పటికీ అలా పాడుకుని ఆనందించేవారు లేకపోలేదు. కానీ ఈనాడు పై పాటకు బదులుగా

***"తక్కువేమి మనకూ
యూనియనొక్కటుండు వరకూ"***

- అనే పాటా, దానితోపాటు కొంత ప్రాబల్యం ఏర్పడినాయి. కనుక ఏ సంస్థలోనూ ఎక్కువ తక్కువల ప్రసక్తి రావడంలేదు.

కాకపోతే పై అధికారులకు సంస్థల యజమానులకూ జీతాలు, వాటితోపాటు దాహాలు, వాటితోపాటు పనిచేయని అహంకారాలూ, ఫలితం లేని ఆలోచనలు, అక్కరకు రాని అక్కసులు, అధికారాన్ని సూచించే మేజాలు వాటిమీద కొనితెచ్చిపెట్టుకున్న రోజాలు. ఇత్యాదులు ఎక్కువగా ఉంటున్నాయి.

ఇలాంటివారికి కొద్దిపాటి జీతాలను ఆశించే నౌకర్లు ఎదురుగుండా అనే "ఎస్సార్"లు అవతలకు పోయి అనుకునే "తప్పుగొయ్యలు" కూడా ఎక్కువగా ఉంటే ఉండవచ్చు.

అయితే, సంస్థల్లోనూ, గృహాల్లోనూ, కూడా ఆశయాలు తక్కువ, అణుకువ తక్కువ అభిమానం తక్కువ. ఐకమత్యం తక్కువ. పోతే ఉపన్యాసాలెక్కువ. ఉద్రేకాలెక్కువ. పూర్వదృష్టి ఎక్కువ. ఉపాయాలెక్కువ. ఉద్యానాలెక్కువ. ఉక్కుచట్రాలెక్కువ. పూజల్లింపులెక్కువ. ఉగ్ర స్వరూపాలెక్కువ. ఉసూరు మనడాలెక్కువ. ఉడుకుబోతుతనాలెక్కువ.. ఇక ఎక్కువ తక్కువల జాబితాలలో చేర్చడానికి తగిన ఏడ్పులు కొన్ని ఉన్నాయి.

జీతాలు తక్కువ - ధరలు ఎక్కువ.

చేసిన పనికి మార్కులు తక్కువ - రిమార్కులెక్కువ.

అధికారులలో సామరస్యం తక్కువ - సణుగుడు ఎక్కువ.

దక్షత తక్కువ - దర్పం ఎక్కువ.

ఉపకారం తక్కువ. ఉప్పునీళ్ళు ఎక్కువ

ఉదాసీనత తక్కువ ఉద్వాసాలెక్కువ.

లాభాలు తక్కువ - స్వలాభాలెక్కువ

ఖజానా తక్కువ - దుబారాలెక్కువ

అదుపు తక్కువ - కుదుపులెక్కువ

ఇలాంటి ఎక్కువ తక్కువలతో చాలా సంస్థలూ, సంసారాలూ నడిచిపోతున్నాయి. చచ్చి, చెడి ప్రతినిత్యం సూర్య నమస్కారాలు చేస్తూ...

పోతే ఎవర్ని ఏ సందర్భంలో పలకరించినా ప్రశ్నించినా "నీ ఎక్కువేమిటి?" అని వెంటనే గ్రుడ్లు ఎర్రజేస్తాడనే భయం మాత్రం ప్రతి హృదయంలో మెదులుతోంది.

దేశంలో వ్యాపించిన ఎక్కువ తక్కువల విచిత్ర కారణాలను మరి కొన్నింటిని మరోసారి వర్ణిస్తాను.

Post your comments